క్లుప్తంగా

మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన



నాయకులతో మాట్లాడుతున్న ఏసీపీ

కూసుమంచి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారిగా బుధవారం కూసుమంచిలోని తన అధికారిక నియోజకవర్గ క్యాంపు కార్యాలయానికి వస్తున్న నేపథ్యాన మంగళవారం ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమానికి విచ్చేసే కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు భోజన ఏర్పాట్ల స్థలాన్ని, వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని కూడా ఏసీపీ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై రమేశ్‌కుమార్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, ఎడవెల్లి రాంరెడ్డి, బారి వీరభద్రం, వెంకన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

రఘునాథపాలెం: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకొనుటకు నల్గొండ, వరంగల్, ఖమ్మం నియోజకవర్గంలోని పట్టభద్రులు వచ్చే నెల (ఫిబ్రవరి) 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ విల్సన్ బెన్నీ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది నవంబర్ 1వ తేదీ నాటికి మూడేళ్ల డిగ్రీ పూర్తయిన వారు దరఖాస్తు చేసుకొనుటకు అర్హులన్నారు. ఫారం 18 పూర్తి చేసి సకాలంలో దరఖాస్తు సమర్పించాలన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: గౌడ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్లను మంగళవారం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన నర్సింహారావు ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండి గౌడ కులస్తుల సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకన్న, వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, రాజశేఖర్, మధు, జనార్దన్, చంద్రశేఖర్, రమేష్, వెంకటాద్రి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన డ్రైవర్ల సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం నాయకులు ఖమ్మం ఆర్డీఓ జి.గణేశ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ.అబ్దుల్ హకీం, తేజావత్ పంతులు, నాయకులు వీరారెడ్డి, అబ్దుల్ పాషా, రఫీ, ఉస్మాన్, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ మెడికల్ అకాడమీ కో డైరెక్టర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న రాయల ఈశ్వరి

ఖమ్మం సహకారనగర్: మోస్ట్ పాపులర్ వైశ్య ఉమెన్, బెస్ట్ ఎడ్యుకేషనలిస్టు ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నట్లు డాక్టర్స్ మెడికల్ అకాడమీ కో డైరెక్టర్ రాయల ఈశ్వరిసతీశ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రులు దామోదర్, సీతక్క, సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. గతంలో ఈశ్వరి నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు, బెస్ట్ బిజినెస్ ఉమెన్ అవార్డులను సైతం గెలుచుకోగ డాక్టర్స్ మెడికల్ అకాడమీ డైరెక్టర్లు రాయల సతీష్‌బాబు, ఈగా భరణికుమార్, లక్ష్మి, విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ ట్రంక్ రోడ్‌లో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఖమ్మం డివిజన్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకులు రెంటాల సమత పర్యవేక్షణలో లెక్కించగా రూ.1,91,031ల ఆదాయం వచ్చింది. దేవస్థానం ముఖ్య కార్యనిర్వాహణాధికారి రామకోటేశ్వరరావు, ఆలయ ఉప ముఖ్య అర్చకులు వీరభద్రరావు, ఆలయ అర్చకులు దాములూరి కృష్ణశర్మ, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	హాయ్ నాన్న
సాయిరాం	డెవిల్
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	బబుల్ గమ్

- ఖమ్మంగాంధీచౌక్

శ్రీరాంనగర్‌లోని ఓ ఇంట్లో జరిగిన చోరీ(ఫైల్)



దొంగలు బాబోయ్..

తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

- పగలు ఆటోలో తిరుగుతూ రెక్కీ
- రాత్రి సమయాన దోచుకెళ్తున్న వైనం
- పోలీసులకు సవాల్‌గా మారిన చోరీలు
- భయాందోళనలో ప్రజలు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్ చేస్తూ.. చోరీలకు పాల్పడుతూ దొంగలు హడలెత్తిస్తున్నారు. దీంతో ఇళ్లు విడిచి బయటి ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చెడు వ్యసనాలకు బానిసలైన కొందరు ఈజీ మనీ కోసం ఇలా దొంగతనాల బాట పట్టి ఇళ్లల్లోకి చొరబడి బంగారం, నగదును కొట్టేస్తున్నారు. పగలు ఆటోలో తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తూ తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా సీసీ కెమెరాలు లేని ప్రాంతాలనే వారు టార్గెట్ చేస్తున్నారు.

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఖమ్మం అర్బన్ స్టేషన్ పరిధి బోనకల్ రోడ్డులోని శ్రీరాంనగర్, శ్రీరాంహిల్స్ ప్రాంతాలతో పాటు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీనగర్ కాలనీల్లో గత కొంతకాలంగా దొంగతనాలు హెచ్చుమీరుతున్నారు. తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో అక్కడి నివాసులు అత్యవసర సమయాన బయటకు వెళ్లాలంటేనే జంకాల్సిన పరిస్థితి నెలకొంది.

పోలీసులకు దొంగల సవాల్..

గత నెలలో శ్రీరాంనగర్‌లో తాళం వేసిన వాటిని లక్ష్యంగా చేసుకొని కొందరు దొంగలు ఐదారు ఇళ్లలో చొరబడి తాళాలు పగలుగొట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. దీంతో ఆ కేసులు పోలీసులకు సవాల్ మారింది. ఏదైనా అత్యవసర పనులు, శుభకార్యాలకు ఒక్క రోజు ఊరెళ్తే చాలు దొంగలు దోచుకెళ్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన శ్రీరాంహిల్స్‌లో కూడా రెండు మూడు రోజులకోసారి జరిగే చోరీలు పోలీసులకు తలనొప్పిన మారింది. కాగా ప్రస్తుతానికి శ్రీరాంహిల్స్‌లో చోరీలు తగ్గి శ్రీరాంనగర్‌లో వరస ఘటనలు జరుగుతున్నాయి.

ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం..



ఏదైనా శుభకార్యాలు, పండుగలు వచ్చినప్పుడు తాళం వేసి ఊరెళ్లే ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా సీసీ కెమెరాలు లేని, ఉన్న పని చేయకుండా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నారు. ఇటీవల జరిగిన చోరీలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక టీంలు తిరుగుతున్నాయి. సీసీఎస్, మఫ్టీ బృందాలు కూడా చోరీలపై దృష్టి సారించారు. కాగా ఎవరైనా ఊరెళ్లేటప్పుడు తమకు సమాచారం ఇవ్వడంతో పాటు విలువైన వస్తువులు బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. గస్తీ పెంచుతాం. ప్రస్తుతానికి చోరీలు అదుపులోనే ఉన్నాయి.

– శ్రీహరి, ఖమ్మం అర్బన్ సీఐ

ఇటీవల జరిగిన సంఘటనలు..

- నగరంలోని శ్రీరాంనగర్ 13వ వీధిలో నివసించే కంచుమర్తి శ్రీనివాసరావు నివాసంలో ఇటీవల చోరీ జరిగింది. గత నెల 14వ తేదీన శ్రీనివాసరావు కుటుంబసమేతంగా ముంబాయి వెళ్లి తిరిగి ఇంటికి రాగా తాళం పగులగొట్టి కనిపించింది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలో దాచిపెట్టిన 3 తులాల బంగారం, 300 గ్రాముల వెండి, రూ.90వేల నగదు దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడి సమాచారం మేరకు ఖానాపురం హవేలి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.
- అలాగే నగరంలోని 16వ డివిజన్ శ్రీరాంనగర్ 14వ వీధిలోమరికంటి శ్రీనివాసరావు నివాసంలోనూ గత నెలలో చోరీ జరిగింది. శ్రీనివాసరావు తండ్రి ఇటీవల చనిపోవడంతో కుటుంబసమేతంగా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లికి వెళ్లారు. ఈక్రమంలో తిరిగి వారు ఇంటికొచ్చే సరికి తలుపు పగులగొట్టి ఉండడాన్ని చూపి లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని రూ.లక్ష నగదు, రెండు తులాల బంగారం, రూ.30వేల విలువైన వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈమేరకు ఖానాపురం హవేలి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించిన వేలిముద్రలు సేకరించి విచారణ చేపట్టారు.



శ్రీరాంనగర్‌లో మరో చోరీ

శివారు ప్రాంతాలే లక్ష్యంగా..

నగరంలోని శివారు ప్రాంతాలనే టార్గెట్ చేస్తూ దొంగలు పెట్రేగిపోతున్నారు. ఏ ఇంట్లో అయితే దొంగలు పడ్డారో వారి ఇళ్లను పోలీసులు తనిఖీ చేసి వేలిముద్రలు సేకరిస్తున్నారు. అయినా చోరీలు మాత్రం తగ్గడం లేదు. చోరీలు తగ్గాలంటే ప్రధానంగా రాత్రి వేళల్లో గస్తీలు పెంచడం, శివారు ప్రాంతాలైన రైలు మార్గం వెంబడి ఉన్న ఉన్న పరిసర కాలనీల్లో పోలీసుల దృష్టి నిలిపితే కొంతమేరకైనా దొంగతనాలు అరికట్టవచ్చని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు ఇప్పటికైనా వరస చోరీలకు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డేటా నమోదులో పొరపాట్లకు తావివ్వొద్దు..



డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపాలన సభల్లో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి పరిశీలించారు. మంగళవారం కేఎంసీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడాన్ని పరిశీలించి, వారితో మాట్లాడారు. దరఖాస్తులోని వివరాలన్నీ నమోదు చేస్తున్నారా.. లేదా..? పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. డేటా నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని, ఏదైనా సందేహాలు ఉంటే వెంటనే అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. రేషన్, ఆధార్ కార్డు నంబర్లు జాగ్రత్తగా నమోదు చేయాలని, ఫిజికల్ దరఖాస్తులో ఉన్న వివరాలు సరితూగాలని అన్నారు.ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీని పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ మల్లీశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవాలు



నాదస్వర కచేరీ చేస్తున్న నిపుణులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ త్యాగరాజ స్వామి పంచదశ ఆరాధన మహోత్సవాలను మంగళవారం నగరంలోని బైపాస్ రోడ్ ఎంబీ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. మామిళ్లగూడెం నుంచి నిర్వాహకులు శోభయాత్ర నిర్వహించారు. అయితపు వెంకటశాస్త్రిచే పూజలు నిర్వహించి నాదస్వర కచేరీ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీవారిదాసుడు, నాదసవర విద్వాన్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన ప్రత్యేక నాదస్వరం తిరుమైజ్ఞానస్ టీపీ రామనాథన్, స్పెషల్ నాదస్వరం పంట మంగళం పీజీ యువరాజ్, స్పెషల్ డోలు విద్వాంసులు ధారాపురం వీయం గణేశ్, కేరళకు చెందిన స్పెషల్ డోల్ విద్వాంసులు జి.అనువేణు గోపాల్ తదితరులు ఈ కార్యక్రమంలో తమ ప్రతిభను ప్రదర్శించారు.

సిండికేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: వ్యాపారులు సిండికేట్ అయి మిర్చి ధరను తగ్గించడంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, ఏఐపీకేఎస్ జిల్లా కమిటీలు ఒక ప్రకటనలో డిమాండ్ చేస్తున్నట్లు బాధ్యులు ఆవుల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.24 వేల ధర ఉన్న మిర్చిని వ్యాపారులు సిండికేట్ అయి రూ.13 వేలకే కొనుగోలు చేస్తున్నారన్నారు. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై చేస్తున్న మోసాన్ని అధికారులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. వ్యాపారుల తప్పుడు పద్ధతులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి మార్కెట్ ఎదుట బైఠాయించి ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

హెచ్ఐవీపై కళాజాతా

ఖమ్మం మామిళ్లగూడెం: హెచ్ఐవీపై నగరంలోని పాత బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో కాంపాటి శ్రీను పల్లెసుద్దుల కళాబృందం వారిచేమంగళవారం కళాజాతా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాగృతి కొండల్‌రావు, శంకర్, కుమారి, శివయ్య, రామకృష్ణ, సలీం, వీరయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్య, స్టాఫ్ నర్సు, సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ కోరారు. మంగళవారం స్థానిక సుందయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 550 పడకల సామర్థ్యంతో వైద్య సేవలందిస్తున్న ఈ ఆస్పత్రిలో అన్ని వైద్య విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రోగులకు సరైన సేవలు అందించలేకపోతున్నారని అన్నారు. ఖమ్మం మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఉన్న జిల్లా జనరల్ ఆస్పత్రిని స్వయం ప్రతిపత్తితో నిర్వహిస్తున్నప్పటికీ, పర్యవేక్షణ అధికారులు నిర్ణయాలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని తెలిపారు. ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై.విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, ఎస్.నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, మీరా, బోడ పట్ల సుదర్శన్‌తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



లక్ష్మిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కూసుమంచి: మండలంలోని లాల్‌సింగ్‌తండాకు చెందిన భూక్యా రాములు కుమార్తె లక్ష్మి అమెరికాలోని న్యూజెర్సీలో గల మౌంట్‌క్లెర్ స్టేట్ యూనివర్సిటీలో మాస్టర్స్ చదివేందుకు ప్రవేశం పొందినందుకు గాను ఆమెను మంగళవారం గ్రామస్తులు అభినందించారు. మారుమూలతండా నుంచి ప్రవేశం పొందినందుకు లక్ష్మిని ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ ధరావత్ వెంకట్, ఎంపీటీసీ బదావత్ మంగ్యా అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నీరజ, ఉపేందర్, శ్రీను, నాగు,లాలూ, రవి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలి..



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను

నేలకొండపల్లి: వచ్చే జూన్,జూలైలో జరిగే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి పాలిత్యా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం మంగాపురంలో భూక్య వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో పొత్తులు ఉన్నా.. లేకున్నా ఒంటరి పోరాటానికైనా సిద్ధపడాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజలకు మరింత దగ్గర అవుతూ తండాలో పార్టీ ఉనికి చాటాలని పిలుపునిచ్చారు. చెరువు మాదారం చెరువుని నింపి మండలంలో ఉన్న అన్ని గ్రామ మంచినీటి సరఫరా చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అర్హులందరికీ వర్తింపజేయాలని, దేవాదాయ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని, మంగాపురంతండా నుంచి చిన్నతండా వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని, చేతి వృత్తి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యవర్గ సభ్యుడు భూక్య రాములునాయక్, గూగుల్ వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

కూసుమంచి/కామేపల్లి: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యాన ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంపై కూసుమంచి, కామేపల్లి మండలాల్లోని గ్రామస్తులకు మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కూసుమంచి మండలం ముత్యాలగూడెంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేంద్ర ప్రభుత్వ ఆధికారి డాక్టర్ పూర్ణిమ, కామేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యాన మండలంలోని కొమ్మినేపల్లి, రుక్కితండా గ్రామాల్లో అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజల దరి చేరాలనే సంకల్పంతో పాటు అభివృద్ధి ఫలాలు అందరికి దక్కాలనే ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తుందన్నారు.కాగా, కామేపల్లిలో పీహెచ్‌సీ ఆధ్వర్యాన ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ విన్న సెంటర్స్ గురించి వివరించి సికిల్ సెంటర్ టీబీ శాంపుల్ కలెక్షన్ సేకరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ బొల్లికొండ శ్రీనివాస్, అధికారులు లక్ష్మణ్, ప్రభరి, రావిష్ ప్రసాద్, సత్యప్రసాద్, నీలోహన, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ రాంచందర్, వైద్యాధికారి కిశోర్ , చందన, ఐకేపీ ఏపీఓ సురేంద్రబాబు, వీరభద్రం, ఏఈఓ మున్నీ, కార్యదర్శి నెహ్రూ, భూక్యా నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి అండగా ఉంటా..



భాషానాయక్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

కామేపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రతీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటానని టీపీసీసీ జనరల్ సెక్రటరీ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. నెమలిపురి గ్రామానికి చెందిన దివంగత మాజీ సర్పంచ్ ధరావత్ భాషానాయక్ జయంతి పురస్కరించుకుని కుటుంబ సభ్యుల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భాషానాయక్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశాడని, ఆయన ఆశయ సాధనకు గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ, ఏపూరి మహేందర్, మద్దినేని రమేశ్‌బాబు, ధరావత్ నాగమణి, ఈశ్వర్, విజయ, అనురాధ, గోపీరెడ్డి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మరియమ్మకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న యూత్ సభ్యులు

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడుకు చెందిన కందుల మరియమ్మ వైద్య చికిత్స కోసం కుటుంబీకులు దాతల చేయూత కోరిన విషయం పాఠకులకు విధితమే. తన తల్లిని బతికించుకోవడానికి ఆర్థిక సాయం అందించాలంటూ ఆమె కుమారుడు, దివ్యాంగుడైన సంపోస్ సాక్షి ద్వారా వేడుకోగా మంగళవారం పలువురు దాతలు ముందుకొచ్చి ఆర్థిక సాయం చేశారు. మంగళవారం నాటికి మొత్తం వచ్చిన మొత్తం రూ.13 వేలను గ్రామ యూత్ సభ్యులు మరియమ్మ కుమారుడికి అందించారు. ఇంకా ఎవరైనా ముందుకొచ్చి మరియమ్మ చికిత్సకు తోడ్పాటునందించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని చర్చి కాంపౌండ్‌లో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మంగళవారం ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేలి చంద్రమోహన్ ప్రారంభించగా.. డాక్టర్ హరినాథ్‌బాబు, నర్సు బిందు వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా, ఖమ్మంతో పాటు కూసుమంచి మండలం ముత్యాలబంజర గ్రామంలో పేద ప్రజలకు సంచార ఉచిత వైద్య సేవలతో పాటు వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందించినట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు, సంస్థ కార్యనిర్వాహణ అధికారి గుడిమళ్ల సూర్యప్రకాశరావు, రాష్ట్ర పరిశీలకులు సాధినేని జనార్దన్‌రావు, సభ్యులు గంటా ఉప్పలయ్య, గజేంద్రుల నాగేశ్వరావు, సాయికుమార్, ఎండీ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి

రఘునాథపాలెం: మండలంలోని కొర్లబోడుతండాలో గల శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. అయ్యప్ప భక్తులు ధరవత్ రవి, పీఠం గురుస్వామి బానోత్ మధు, బానోత్ నరేశ్, బానోత్ కోట, బానోత్ మణికంఠ, భూక్యా చిన్నయ్యనాయక్ దంపతులు తదితరులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఆదిత్య బిర్లా ఆధ్వర్యాన బిట్స్ పిలాని వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇన్ఫినిటీ పరీక్షలో సౌత్ జోన్ నుంచి తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూదేశవ్యాప్తంగా గణిత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు 9,10వ తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహించగా.. 4 జోన్లలో ఎంపిక చేసిన టీమ్‌ల్లో హార్వెస్ట్ టీమ్ ద్వితీయ స్థానం, వ్యక్తిగత రౌండ్‌లో రేవంత్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు బొంబాయిలో జరిగే ఆలిండియా స్థాయి పరీక్షల్లో తమ విద్యార్థులు కె.ఫన్విక్ చౌదరి, ఎం.శ్రీకర్‌రెడ్డి, ఎం.చరత్‌చంద్ర, కృష్ణమాదూర్, రేవంత్‌కుమార్, కె.చైత్రిక్, సాయిచరణ్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ బ్రాంచ్ ఇన్‌చార్జ్‌లు ఉమామహేశ్వరరావు, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు క్రీడాపోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, తదితరులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు ప్రారంభించగా.. ఖో-ఖో, వాలీబాల్, షటిల్, చెస్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు బుధవారం ముగియనుండగా గురువారం జరగనున్న ఫ్రెషర్స్ డేలో విజేతలకు బహుమతులు అందజేస్తారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓలు అమర్‌సింగ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యమైన రేషన్ బియ్యం సరఫరా..



ఇందిరానగర్ రేషన్ దుకాణం వద్దకు వచ్చిన వినియోగదారులు

ఖమ్మంఅర్బన్: ప్రతి నెలా 3, 4 తేదీల్లో ప్రారంభయయ్యే రేషన్ బియ్యం పంపిణీ ఈ నెల మాత్రం ఐదు రోజులు ఆలస్యమైంది. గత నాలుగు రోజులుగా బియ్యం కోసం దుకాణాల చుట్టూ తిరిగిన వినియోగదారులు మంగళవారం రేషన్ దుఖాణాలు తెరుచుకోవడంతో ఉదయాన్నే క్యూ కట్టారు. ప్రతి నెలా 3, 4 తేదీల్లో రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభమై అదే నెల 19, 20 తేదీల వరకూ ఇచ్చేవారు. కాని ఈ నెల ఆలస్యం కావడంతో ఈ నెలాఖరు వరకు ఇస్తారా అనేది అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈనెల సంక్రాంతి పండుగ ఉన్న నేపథ్యాన చాలామంది రేషన్ బియ్యం కోసం దుకాణాల వద్ద బారులుదీరుతున్నారు. కొన్నిసార్లు రేషన్ షాపుల వద్ద ఇచ్చే బియ్యం సరఫరా తేదీలు, డీలర్ల సమయపాలన విషయంలో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో సివిల్ సప్లయీస్ అధికారులు స్పందించి రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసే కచ్చితమైన తేదీలు, సమయపాలన ప్రకటించాలని కోరుతున్నారు. ఈ విషయంపై సివిల్ సప్లయీస్ డీటీ ఎండీ.నజీర్‌ను వివరణ కోరడానికి ప్రయత్నించగా ఫోన్‌లో స్పందించలేదు.